


**జరిగిన కథ :** కన్యాకుబ్జ రాకుమారులు ఐదుగురు పశ్చిమ దిగ్విజయ యాత్ర చేస్తున్నారు. వారిలో పెద్దవాడికి మహారాష్ట్ర రాకుమారితో పెళ్లయింది. మిగిలిన నలుగురూ వరుణద్వీపానికి దండెత్తి వెళ్తుండగా.. సముద్రంలో ఓడలు మునిగిపోయాయి. విక్రముడు ముందుగా బయటపడి, ఒక ద్వీపంలోని గాయత్రీ మందిరానికి చేరుకున్నాడు. అక్కడ దేవతాకన్యలు చెప్పుకొంటున్న మాటలు వింటున్నాడు.



# వరించిన అదృష్టం


అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**


‘‘ఆర్యకా! అసలేం జరిగిందో సరిగా చెప్పు’’ అడిగాడు నారదుడు.

అదిమి పెట్టడానికి వీల్లేకుండా పొంగి వస్తున్న దుఃఖాన్ని అతిప్రయత్నం మీద ఆపుకొంటూ.. ఆర్యకుడు తన బాధను ఇలా చెప్పసాగాడు..

‘‘స్వామీ! మా నాగజాతిని పుట్టుకతోనే గరుడునికి ఆహారంగా విధించాడు కదా పరమాత్మ!! ఆ గరుడునికి, మాకు దాయాది పగ ఎప్పటికీ చల్లారిపోయేది కాదు. ఒకసారి అతడి ఆకలికి మా జాతి అంతరించిపోయే స్థితికి వచ్చింది. దొరికిన నాగులనందర్నీ దయావిహీనుడై భక్షించేవాడు గరుడుడు. బంధుత్వాన్ని పాటించకుండా మాకు నిత్యం ప్రాణసంకటం తెచ్చిపెట్టేవాడు. శేషుడు, వాసుకి వంటి ప్రముఖుల వంశాల జోలికి పోకుండా.. సామాన్య కుటుంబాలనే నాశనం చేసేవాడు. ఆయన ఆకలికి మూషికాద, దధిముఖ, వసంతక మొదలైన నాగ కుటుంబాలు నశించిపోయాయి. ఇంకా అలాగే వదిలేస్తే క్రమంగా నాగకులమే అంతరించిపోతుందనే భయంతో మేమంతా.. మా పెద్దలను సంప్రదించాం. వాసుకి, ఆయన మనుమడైన అశ్వతరుడు, తక్షకుడు, కర్కోటకుడు వంటి పెద్దలంతా కలిసి గరుడుని సంధికి ఒప్పించారు. దానిప్రకారం నెలకొక కుటుంబం నుంచి స్వచ్ఛందంగా, శ్రేష్ఠమైన ఆహారం సమర్పిస్తామని.. అందుకు బదులుగా మాకు సంఘ మరణాలను తప్పించాలని ఒడంబడిక చేసుకున్నాం. కిందటినెలలో మా కుటుంబం వంతు వచ్చింది. నా కుమారుడైన చికురుణ్ని, గరుడుడు మా కళ్లముందే భక్షించాడు. అంతటితో విడిచిపెట్టకుండా, తండ్రి మరణాన్ని చూసి దుఃఖిస్తున్న నా మనుమడైన సుముఖుణ్ని చూసి.. ‘వచ్చేనెలలో వీణ్ని భక్ష్యంగా ఏర్పాటుచేయండి’ అని ఆజ్ఞాపించి పోయాడు. న్యాయంగా అయితే ఏడాది తరువాత ఒక కుటుంబానికి వంతు రావాలి. మనమణ్ని కూడా పోగొట్టుకుంటే నా వంశమే పోతుంది. ఈ అన్యాయాన్ని ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదు?!’’.. అంటూ దుఃఖాన్ని తట్టుకోలేక ఏడవసాగాడు.

నారదుడు అతణ్ని ఊరడించి..

‘‘ఆర్యకా! ఊరడిల్లు. నీకొచ్చిన ఆపద ఏమీ లేదు. సాక్షాత్తూ మహేంద్రుని మంత్రితోనే వియ్యమందబోతున్నావు. మీవాణ్ని రక్షించే భారం ఆయనపైనే ఉంచుదాం. ముందు మీ కుటుంబమంతా పెళ్లికి తరలిరండి’’ అని పలికాడు.

వాళ్లు స్వర్గానికి వెళ్లిన కొద్దిరోజులకే గరుత్మంతుడు యథావిధిగా తన ఆహారం కోసం వచ్చేశాడు. జరిగిన సంగతి తెలుసుకుని, హుటాహుటిన స్వర్గానికి ఎగిరాడు. అప్పటికే అక్కడ పెళ్లి ఏర్పాట్లు జరిగిపోయాయి. దేవేంద్రుని సభాభవనం అయిన సుధర్మలో పెళ్లితంతు నిర్వహిస్తున్నారు. ఇంతలో గరుత్మంతుడు వస్తున్నాడన్న వార్త తెలియగానే పీటలమీదనున్న పెళ్లికొడుకుతో సహా నాగులందరూ స్తంభాల మాటున, ఆసనాల చాటున కనిపించకుండా దాక్కున్నారు.

గరుత్మంతుడు వస్తూనే ఆవేశంగా..

‘‘మహేంద్రా! నీకిది తగునా? నా ఆహారాన్ని కొల్లగొట్టి, నాకు అన్యాయం చేస్తావా?’’ అని ప్రశ్నించాడు.

అందుకు మహేంద్రుడు..

‘‘పక్షిరాజా! నేను అన్ని సంగతులూ విచారించాను. వంతు రాకుండానే సుముఖుణ్ని కోరడం అక్రమం కాదా?! అతడికి బదులుగా నువ్వు కోరిన బలమైన నాగులను నీకు ఆహారంగా సమర్పిస్తాను. ఇంకేం కావాలన్నా ఇస్తాను. అతణ్ని విడిచిపెట్టు’’ అని పలికాడు.

‘‘వీల్లేదు’’ అని హుంకరించాడు గరుత్మంతుడు.

‘‘వీణ్ని భక్షించి తీరతానని నాగసభా మధ్యంలో శపథం చేసి వచ్చాను. ఇప్పుడు విడిచిపెడితే ఇక నాగులెవరూ నన్ను లెక్క చేయరు. కనుక నీ పట్టు విడిచి.. వాణ్ని ఇలా పంపించు’’ అన్నాడు.

‘‘సుపర్ణా! మా దేవతలందరి అభిప్రాయం ఒక్కటే. నువ్వు సుముఖుణ్ని విడిచిపెట్టాలి. మేమే కాదు.. నువ్వు సేవించే విష్ణుదేవుని మాట కూడా ఇదే’’ అని అక్కడే ఆసీనుడై ఉన్న స్వామివారిని చూపించాడు మహేంద్రుడు.

గరుత్మంతుడు వెనక్కి తగ్గలేదు.

‘‘మహేంద్రా! నేను కాకుండా ఉపేంద్రుణ్ని మోయగలిగిన వాడెవ్వడు?! ఆయన ధ్వజంపై నిలిచి.. ఆయనకు జయాలు చేకూర్చేవాణ్ని నేనే కదా! అంతటి ఆప్తుడనైన నా నోటిదగ్గర కూడును నా స్వామి చూస్తూ దూరం చేస్తాడా?!’’ అని గర్వం ప్రదర్శించాడు.

మహేంద్రుడు నిరుత్తరుడయ్యాడు. అప్పుడు విష్ణుదేవుడు కలగచేసుకుని..

‘‘గరుడా! నువ్వు పలికిన మాటలన్నీ నాకు సంతో